RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:56 | ఫిబ్రవరి 04, 2026 | వెల: రూ.3-00




### మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

- పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు
- సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ శివధర్ రెడ్డి

2లో

**గెలుపోటముల సమీకరణాలను మార్చేస్తున్న అసమ్మతి**

**కష్టపడ్డ వారికి కాకుండా వలస వచ్చిన వారికి టికెట్లు**




**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల పోరు తీవ్రమవుతుండగా, అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలకు రెబల్ అభ్యర్థుల సెగ కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసినప్పటికీ, పలుచోట్ల అసమ్మతి నేతలు బరిలో నిలవడంతో పార్టీల గెలుపోటముల సమీకరణాలు తారుమారు అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బుజ్జగింపులు, నామినేటెడ్ పదవుల హామీలు ఫలించకపోవడం, అంతర్గత కోవర్ట్ పాలిటిక్స్, ఎమ్మెల్యేలు–మాజీ ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు వంటి అంశాలు అధిష్ఠానాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా, ఈ ఫలితాలు మంత్రుల పనితీరుకు గీటురాయిగా మారనున్న నేపథ్యంలో, రెబల్స్ వల్ల సీట్లు కోల్పోతే భవిష్యత్తులో తమ పదవులకు ముప్పు వాటిల్లుతుందేమోనని మంత్రులు టెన్షన్‌లో ఉన్నారు. ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడిన వారిని కాదని, వలస వచ్చిన వారికి టికెట్లు కేటాయించడం వంటి పరిణామాలు కేడర్‌లో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తూ, ఈ మున్సిపల్ రణాన్ని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి.




# మున్సిపోల్స్.. రెబెల్స్!

- బుజ్జగింపులతో నామినేషన్ విరమించుకున్న కొందరు..
- అయినా లోలోపల రగిలిపోతున్న అసంతృప్తులు
- పోటీకి సై అంటున్న మరికొందరు..
- పెద్ద నేతల మధ్య ఆధిపత్య పోరు
- వెన్నుపోటు రాజకీయాలు షురూ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీల్లోనూ ఇదే పరిస్థితి
- ముంచేస్తారో.. తేల్చేస్తారో అన్న టెన్షన్‌లో పార్టీలు

2లో



## కాంగ్రెస్‌దే విజయం

2లో

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఏదులాపురంలో కాంగ్రెస్ అభ్యర్థులకు బీ-ఫారాల అందజేత



## నల్లగొండ అభివృద్ధే నా ధ్యేయం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

2లో

# స్టాక్ మార్కెట్లలో బుల్ ర్యాలీ

## భారత్-అమెరికా వాణిజ్య డీల్ ఎఫెక్ట్



- సెన్సెక్స్, నిఫ్టీ రికార్డు లాభాలు..
- ఇన్వెస్టర్లలో ఉత్సాహం
- పెరిగిన రూపాయి విలువ
- 2018 తర్వాత వచ్చిన అతిపెద్ద లాభం

2లో

**వేద న్యూస్, డెస్క్**

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారుకావడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం చరిత్రాత్మక లాభాలతో దూసుకుపోయాయి. భారత వస్తువులపై విధించే సుంకాలను 18 శాతానికి తగ్గిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో మార్కెట్లలో కొనుగోళ్ల జోరు ఒక్కసారిగా పెరిగింది. ఈ ఒప్పందం భారత ఎగుమతులు, పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊతమిస్తుందన్న అంచనాలతో ఇన్వెస్టర్లు భారీగా షేర్లు కొనుగోలు చేశారు. ట్రేడింగ్ ప్రారంభం నుంచే లాభాల బాట పట్టిన మార్కెట్లు చివరి వరకు అదే ఊపును కొనసాగించాయి. రోజువారీ ముగింపులో సెన్సెక్స్ 2072.67 పాయింట్లు లాభపడి 83,739.13 వద్ద, నిఫ్టీ 639.15 పాయింట్లు

మిగతా 2వ పేజీలో..


## కంగ్రాట్యులేషన్స్ సీఎం సర్

- ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ కోర్సు పూర్తి చేసినందుకు అభినందనలు
- సీఎం నివాసంలో మంత్రివర్గ సహచరుల భేటీ

2లో



# మున్సిపోల్స్.. రెబెల్స్!




**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల రణం ముదురుతోంది. ఒకవైపు ప్రచారం జోరందుకుంటుంటే, మరోవైపు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు రెబల్ అభ్యర్థులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసినప్పటికీ, బరిలో నిలిచిన అసమ్మతి నేతలు పార్టీల గెలుపోటములను తారుమారు చేసేలా కనిపిస్తున్నారు. బుజ్జగింపులు ఫలించిన చోట ఊపిరి పీల్చుకుంటున్న అధిష్టానం.. మొండికేసిన నేతల వల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతోంది. రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది అసమ్మతి నేతలు బరిలో నిలవడం రాజకీయ సమీకరణాలను తలకిందులు చేయనుంది.

### కొలిక్కిరాని బుజ్జగింపులు..

నామినేషన్ల విరమణ కోసం పార్టీల అధిష్టానాలు సర్వశక్తులూ ఒడ్డాయి. జిల్లా మంత్రులు, సీనియర్ నేతలు రంగంలోకి దిగి రెబల్ అభ్యర్థులతో చర్చలు జరిపారు. కాగా, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి, భవిష్యత్తుపై నమ్మకంతో కొందరు తమ నామినేషన్లను వెనక్కి తీసుకున్నారు. మరికొందరేమో ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడితే గుర్తించలేదు.. ఇప్పుడు మా సత్తా ఏంటో చూపిస్తాం.. అంటూ స్వతంత్రులుగా బరిలో నిలిచారు. వీరి వల్ల ప్రధాన పార్టీల ఓటు బ్యాంకు చీలిపోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

## ఆధిపత్య పోరు!

చాలా చోట్ల పార్టీల మధ్య కంటే వ్యక్తుల మధ్య పోరు ఎక్కువగా ఉంది. తమ అనుచరుల కోసం టికెట్లు ఆశించిన సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మరియు మాజీ ఎమ్మెల్యేలకు లేదా సీనియర్ నేతలకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఎమ్మెల్యే వర్గం ఒకరికి మద్దతు ఇస్తుంటే, వ్యతిరేక వర్గం రెబల్‌ను ప్రోత్సహిస్తోంది. జగిత్యాల జిల్లాలో ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి సంబంధించి ఈ ఇష్యూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడ చర్చనీయాంశంగా మారింది.. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఒకరినొకరు తీవ్రంగా విమర్శించుకుంటున్నారు. కారు పార్టీలో కూడా అభ్యర్థుల ఎంపికలో ఎమ్మెల్యేల ఏకపక్ష నిర్ణయాల వల్ల పాత కార్యకర్తలు తిరుగుబావుటా ఎగురవేశారు. మొదటి నుంచి పార్టీ జెండా మోసిన వారిని కాదని, వలస వచ్చిన వారికి టికెట్లు ఇవ్వడంపై కేడర్ రగిలిపోతోంది.

- గెలుపోటముల సమీకరణాలను మార్చేస్తున్న అసమ్మతి
- కష్టపడ్డ వారికి కాకుండా వలస వచ్చిన వారికి టికెట్లు
- బుజ్జగింపులతో నామినేషన్ విరమించుకున్న కొందరు..
- అయినా లోలోపల రగిలిపోతున్న అసంతృప్తులు
- పోటీకి సై అంటున్న మరికొందరు..
- పెద్ద నేతల మధ్య ఆధిపత్య పోరు
- వెన్నుపోటు రాజకీయాలు షురూ
- కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీల్లోనూ ఇదే పరిస్థితి
- ముంచేస్తారో.. తేల్చేస్తారో అన్న టెన్షన్‌లో పార్టీలు

### ఫలించని హామీలు!

రెబల్స్‌ను కట్టడి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సరికొత్త ఆఫర్లను తెరపైకి తెచ్చింది. నామినేషన్ ఉపసంహరించుకున్న వారికి భవిష్యత్తులో మార్కెట్ కమిటీ చైర్మన్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు లేదా ఇతర నామినేటెడ్ పదవులు ఇస్తామని బంపర్ ఆఫర్లు ఇచ్చారు. అయితే, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని చాలా మంది ఈ హామీలను నమ్మే పరిస్థితిలో లేరు. పదవి వచ్చిన తర్వాత చూద్దాం.. ఇప్పుడు పోటీ చేయడమే ముఖ్యం అనే ధోరణి అసమ్మతి నేతల్లో కనిపిస్తోంది.

### టెన్షన్‌లో మంత్రులు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఎన్నికలను మంత్రులకు ఒక సవాల్‌గా విసిరారు. ఈ ఫలితాలు మంత్రుల పనితీరుకు నిదర్శనమని, తమకు అప్పగించిన జిల్లాలతో పాటు, తమ నియోజకవర్గాల్లో మెజారిటీ స్థానాలు రాకపోతే భవిష్యత్తులో కేబినెట్ పదవులకే ముప్పు వాటిల్లుతుందని పరోక్షంగా హెచ్చరించారు. రెబల్స్ కారణంగా సీట్లు కోల్పోతే సీఎంకు ఏమని సమాధానం చెప్పాలో తెలియక మంత్రులు టెన్షన్‌లో ఉన్నారు. దీంతో వారు తమ నియోజకవర్గాల్లో తిష్టవేసి, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ.. అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు.

### కోవర్ట్ పాలిటిక్స్ షురూ..

ప్రస్తుతం రాజకీయాల్లో మరో ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోంది. నామినేషన్లు విరమించుకున్న వారు సైతం పార్టీకి పూర్తిగా సహకరించడం లేదు. కొందరు నేతలు లోలోపల వేరే పార్టీ అభ్యర్థులతో లేదా రెబల్ అభ్యర్థులతో కుమ్మక్కవుతున్నారు. టికెట్ రాని వారు కొందరు అసంతృప్తితో సొంత పార్టీ అభ్యర్థిని ఓడించి, తమ బలాన్ని నిరూపించుకోవాలని చూస్తున్నారు. ఈ వెన్నుపోటు రాజకీయాలు పార్టీల గెలుపు అవకాశాలను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయి.

### కష్టపడ్డవారికి కన్నీరు..

ఎన్నికల సమయంలో రెండు ప్రధాన పార్టీలు చేసిన అతిపెద్ద తప్పు ఇదేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో ఏళ్ల తరబడి కష్టపడ్డ వారిని విస్మరించి, ఎన్నికల ముందు చేరిన వారికి లేదా ఆర్థికంగా బలంగా ఉన్నవారికి టికెట్లు కేటాయించడం గందరగోళానికి దారి తీసింది. ఇది కేడర్‌లో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసింది.

---

## మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

**పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి**

**అవాంఛనీయ ఘటనలకు తావివ్వొద్దు**

**సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ శివధర్ రెడ్డి**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**



మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా, శాంతియుతంగా నిర్వహించాలని రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. ఎన్నికలు జరుగనున్న ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించనున్న జిల్లాల పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో చట్టసువ్యవస్థ పరిరక్షణనే ప్రధాన లక్ష్యంగా తీసుకుని పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. సున్నిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీజీపీ సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు ప్రశాంతంగా సాగేలా అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో పోలీసులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు భద్రతా భావన కలిగేలా విధులు నిర్వర్తించాలని డీజీపీ బి. శివధర్ రెడ్డి ఐపీఎస్ అధికారులకు స్పష్టం చేశారు.

---

## అన్ని వార్డుల్లోనూ కాంగ్రెస్‌దే విజయం

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఏదులాపురంలో కాంగ్రెస్ అభ్యర్థులకు బీ-ఫారాల అందజేత**



**వేద న్యూస్, ఖమ్మం**

ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మంగళవారం బీ–ఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని అభ్యర్థులకు అధికారికంగా బీ–ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను చూస్తే అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తారన్న నమ్మకం ఉందన్నారు. అభ్యర్థులు కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ గడపగడపకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి ఆశీర్వాదంతో విజయం సాధించాలని సూచించారు.

---





## ఘనంగా ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి జన్మదిన వేడుకలు

ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి జన్మదిన వేడుకలు తహసీల్దార్ ఇక్బాల్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఆర్ఎస్ఏ స్టేట్ ఆర్గనైసింగ్ సెక్రటరీ కొమాండ్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రవి, అజయ్ కుమార్, గిర్దావర్‌లు, జీపీఓలు తదితరులు పాల్గొన్నారు. - వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి

---

## నల్లగొండ అభివృద్ధే నా ధ్యేయం

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు కోరిన మంత్రి**

**వేద న్యూస్, నల్లగొండ ప్రతినిధి**

గత 25 ఏళ్లుగా నల్లగొండ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలే తన బలమని, ఈ ప్రాంత అభివృద్ధే తన ప్రాణమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పలు డివిజన్లలో పర్యటించిన ఆయన, తన చివరి శ్వాస వరకు ప్రజల సంక్షేమం కోసమే పని చేస్తానని స్పష్టం చేశారు. నల్లగొండను హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పట్టణానికి భారీగా నిధులు కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు చేరుస్తున్నామని చెప్పారు. రహదారులు, పారిశుధ్యం, తాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిపక్షాల మాయమాటలను ప్రజలు నమ్మవద్దని సూచించిన మంత్రి, నల్లగొండ పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రజల నమ్మకాన్ని ఎప్పటికీ నిలబెట్టుకుంటూ, నల్లగొండను రాష్ట్రంలోనే అభివృద్ధిలో ముందంజలో నిలుపుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

---

## హార్వర్డ్ కెనెడీ స్కూల్ ప్రోగ్రామ్ పూర్తి చేసిన సీఎం రేవంత్ రెడ్డికి అభినందనలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

- ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ కోర్సు పూర్తి చేసినందుకు విషెస్
- సీఎం నివాసంలో మంత్రివర్గ సహచరుల భేటీ

ప్రఖ్యాత హార్వర్డ్ కెన్నడీ స్కూల్లో నిర్వహించిన 'లీడర్ షిప్ ఇన్ ద 21సెంచరీ' ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రివర్గ సహచరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్ తదితరులు సీఎం రేవంత్ రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి కూడా ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలియజేశారు. అంతర్జాతీయ స్థాయి నాయకత్వ శిక్షణ రాష్ట్ర పాలనకు మరింత దిశానిర్దేశం చేస్తుందని వారు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి పాలన అనుభవాలు, ఆధునిక నాయకత్వ విధానాలు తెలంగాణ అభివృద్ధి ప్రణాళికల్లో ప్రతిఫలిస్తాయని నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో నవీన ఆలోచనలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని ముందంజలో నిలపాలన్న సంకల్పాన్ని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

---

## స్టాక్ మార్కెట్లలో బుల్ ర్యాలీ

**భారత్-అమెరికా వాణిజ్య డీల్ ఎఫెక్ట్**



మొదటి పేజీ తరువాయి

పెరిగి 25,727.55 వద్ద స్థిరపడింది. ఇటీవల కేంద్ర బడ్జెట్ ప్రభావంతో ఒత్తిడిలో ఉన్న మార్కెట్లు ఒక్కరోజులోనే గట్టిగా కోలుకోవడం విశేషం.

### భారీ షేర్లలో కొనుగోళ్ల జోరు

బ్లూచిప్ షేర్లలో బలమైన కొనుగోళ్లు కనిపించాయి. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఇండిగో, పవర్ గ్రిడ్, ఎల్‌అండ్‌టీ, టాటా మోటార్స్ వంటి షేర్లు గణనీయంగా పెరిగాయి. అమెరికా మార్కెట్‌కు అధికంగా ఎగుమతులు చేసే కంపెనీల షేర్లకు ఇన్వెస్టర్లు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు.

### రంగాల వారీగా విస్తృత లాభాలు

రంగాల వారీగా చూస్తే రియల్టీ, ఫార్మా, కెమికల్స్, మెటల్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఆటో, ఐటీ సహా అన్ని రంగాల సూచీలు లాభాల్లో ముగిశాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా దాదాపు 2.5–2.8 శాతం మేర పెరిగి మార్కెట్ ర్యాలీకి మరింత బలం చేకూర్చాయి.

### రూపాయికి భారీ బలం

మరో కీలక పరిణామంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఒక్కరోజులోనే 1.28 రూపాయలు బలపడింది. ఇది 2018 తర్వాత రూపాయికి వచ్చిన అతిపెద్ద ఒక్కరోజు లాభంగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. విదేశీ పెట్టుబడిదారుల నుంచి డాలర్ ప్రవాహం పెరుగుతుందన్న అంచనాలు రూపాయికి మద్దతుగా నిలిచాయి.

### నిపుణుల అభిప్రాయం

మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం వల్ల ఎగుమతులు పెరగడం, కార్పొరేట్ లాభాలు మెరుగుపడటం, విదేశీ పెట్టుబడులు మళ్లీ భారత్ వైపు మళ్లే అవకాశం ఉంది. గ్లోబల్ మార్కెట్లు సహకరిస్తే సమీప కాలంలో సెన్సెక్స్, నిఫ్టీ మరిన్ని రికార్డులు నమోదు చేసే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మారని గ్రామాల పరిస్థితి

- కొత్త సర్పంచ్‌లు వచ్చినా ఎక్కడి సమస్యలు అక్కడే
- ఉపాధి లేక వలస పోతున్న యువత
- అభివృద్ధి మాటలు.. హామీలకే పరిమితం





**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో గ్రామాభివృద్ధికి నాంది పలుకుతామని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కొత్త సర్పంచ్‌లు అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా, చాలా చోట్ల పరిస్థితి మాత్రం యథాతథంగానే కొనసాగుతోంది. రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు ఇప్పటికీ సమస్యగానే మారాయి. ఎన్నికల సమయంలో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పిన నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత పాత పాలనకే కొనసాగింపుగా మారారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో మురుగు నీరు నిలిచిపోవడం, సీసీ రోడ్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రోజువారీ జీవితం అస్తవ్యస్తంగా మారుతోందని వారు వాపోతున్నారు. కొత్త సర్పంచ్ వస్తే అయినా సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించాం. కానీ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు.. అని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో ఉపాధి అవకాశాలు లేక యువత వలస బాట పట్టాల్సిన పరిస్థితి నెలకొంది. నిధుల కొరత కారణంగా అభివృద్ధి పనులు ఆలస్యం అవుతున్నాయని ప్రజాప్రతినిధులు చెబుతున్నా, గ్రామస్తులు మాత్రం పాలకులలో చిత్తశుద్ధే లోపించిందని తీవ్రంగా విమర్శిస్తున్నారు. మొత్తానికి కొత్త సర్పంచ్‌లు వచ్చినప్పటికీ గ్రామాల్లో ఆశించిన స్థాయిలో మార్పు కనిపించకపోవడం ప్రజల్లో నిరాశను పెంచుతోంది. ఇకనైనా పాలకులు స్పందించి గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత నాదే



- పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పేదల గురించి పట్టించుకోలేదు
- అప్పుడు అరాచకం.. ఇప్పుడు ఆరాటం!
- గత పాలకుల నిర్లక్ష్యంపై మంత్రి పొంగులేటి నిప్పులు
- ఏదులాపురంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

అధికారంలో ఉన్న పదేళ్ల పాటు నిరుపేదల ఇళ్ల స్థలాల గురించి పట్టించుకోకుండా అరాచకంగా వ్యవహరించిన వారు.. నేడు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ఆరాటపడుతున్నారు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 12, 13 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో పాల్గొన్న ఆయన, విపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. గత పాలకులు పేదల సొంతింటి కలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ఆనాడు అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా వంచించారని మండిపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి ప్రజలకు కీలక భరోసా ఇచ్చారు. ఇళ్ల స్థలాలు ఇచ్చే మంత్రిని కూడా నేనే. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన ప్రతి నిరుపేదకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, వాటిలో ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చే పూర్తి బాధ్యత నాదే అని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఏప్రిల్ నుంచి వరుస విడతల్లో ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు విశ్రమించబోమని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలతో పేదలకు అండగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, అన్ని వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైన్ల పనులను వేసవి లోపే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తనను అసెంబ్లీ ఎన్నికల్లో ఆదరించినట్టే, ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

# ఎస్సీ కాలనీలో తీరిన తాగునీటి కష్టాలు

## – ఆరు నెలల సమస్యకు శాశ్వత పరిష్కారం



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండలం గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ వాసులు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న ప్రధాన తాగునీటి సమస్యకు నేటితో తెరపడింది. కాలనీలోని మంచినీటి పైపులైన్లలో పేరుకుపోయిన చెట్ల వేర్లను తొలగించి, కొత్త పైపులు ఏర్పాటు చేయడంతో నీటి సరఫరా సజావుగా పునరుద్ధరించబడింది. స్థానిక ఎస్సీ కాలనీలో గత ఆరు నెలలుగా నల్లాల్లో నీరు సరిగా రాకపోవడంతో మహిళలు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమీపంలోని పాఠశాల ఆవరణలో ఉన్న పెద్ద మర్రిచెట్టు వేర్లు భూగర్భంలోని పైపులైన్లలోకి చొచ్చుకుపోయి నీటి ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకున్నట్లు గుర్తించారు. దీంతో పైపులు జామ్ అయి, కాలనీవాసులకు చుక్క నీరు కూడా అందని పరిస్థితి నెలకొంది. కాలనీ వాసుల విన్నపం మేరకు వార్డు మెంబర్‌తో పాటు గ్రామ సర్పంచ్ రంజిత్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సమస్య తీవ్రతను గుర్తించిన వెంటనే మంగళవారం జేసీబీ సహాయంతో పైపులైన్ ఉన్న ప్రాంతాన్ని తవ్వించారు. పైపుల్లోకి చొచ్చుకుపోయిన మర్రిచెట్టు వేర్లను పూర్తిగా తొలగించి, పాడైన పైపుల స్థానంలో కొత్త పైపులు ఏర్పాటు చేసి పనులను పూర్తిచేశారు. తమ గోడును ఆలకించి వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించినందుకు ఎస్సీ కాలనీ వాసులు స్థానిక వార్డు మెంబర్‌కు, సర్పంచ్‌కు, పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం నల్లాల్లో నీరు సజావుగా వస్తుండటంతో కాలనీలో ఆనందం వెల్లివిరుస్తోంది.

# పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తల సమ్మె నోటీసు

**వేద న్యూస్, రుద్రూర్:**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, 29 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన దేశవ్యాప్త సమ్మెలో ఆశా కార్యకర్తలందరూ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రుద్రూర్ పీహెచ్‌సీలోని మెడికల్ ఆఫీసర్ ఆయేషా సిద్ధిఖాకు ఆశా కార్యకర్తలు సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ మండల కార్యదర్శి వాణి, యూనియన్ నాయకులు ప్రవళిక, ప్రేమల, గంగామణి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



# నాగుర్లకు శుభాకాంక్షలు



**వేద న్యూస్, ఎల్కతుర్తి:**

తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నాగుర్ల వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం నాగూర్ల వెంకటేశ్వరులకు ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీ, తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ హింగే, రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, నాయకులు మాధవరావు పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

# మరణించిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సహాయం



**వేద న్యూస్, కాజీపేట:**

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి 63వ డివిజన్‌కు చెందిన కంది రమేష్ మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గండికోట వెంకన్న రమేష్ కుటుంబాన్ని పరామర్శించి, తన వంతు సహాయంగా దహన సంస్కారాల నిమిత్తం రూ. 5వేల నగదు అందజేశారు. అనంతరం రమేష్ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర కార్యదర్శి పల్లపు వెంకటేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు మల్లికార్జున్, కాజీపేట మండల ప్రెసిడెంట్ కందిరాజు, కంది సురేష్‌తో పాటు పలువురు వడ్డెర సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

# కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలవాలి

## – మందమర్రి ఏరియా డీజీఎం (పర్సనల్) అశోక్



**వేద న్యూస్, మందమర్రి:**

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి శిక్షణ కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకుని కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలవాలని మందమర్రి ఏరియా డీజీఎం (పర్సనల్) సీహెచ్ అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలోని నియోగ హాల్‌లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులతో పాటు రామకృష్ణాపూర్‌లో నిర్వహిస్తున్న బ్యూటీషియన్ శిక్షణ తరగతులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కోర్సులు బోధిస్తున్న శిక్షకులతో మాట్లాడి, వివిధ కోర్సుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న సింగరేణి ఏరియా మహిళలు, సింగరేణి కార్మిక కుటుంబాల మహిళలతో మాట్లాడుతూ, సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత వృత్తి శిక్షణ కోర్సుల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి, ఆర్థికంగా స్వావలంబన సాధించడమే ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉచిత శిక్షణ కోర్సులు నేర్చుకుంటున్న మహిళలు పాల్గొన్నారు.

# ప్రత్యర్థి పార్టీల ప్రలోభాలకు లొంగవద్దు

## – బడుగుల లింగయ్య యాదవ్ – 42 మందికి బీఆర్ఎస్ బీ ఫారాలు పంపిణీ



**వేద న్యూస్, దామరచర్ల:**

మున్సిపాలిటీ ఎన్నికల బరిలో నిలవనున్న 42 మంది బీఆర్ఎస్ అభ్యర్థులకు మిర్యాలగూడ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం బీ ఫారాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఎన్నికల సమన్వయకర్త బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావులు అభ్యర్థులకు అధికారికంగా బీ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ.. గతంలో పార్టీ చేసిన అభివృద్ధి పనులే గెలుపుకు మార్గం వేస్తాయని అన్నారు. ప్రత్యర్థి పార్టీల ప్రలోభాలకు లొంగకుండా, ప్రజల నమ్మకాన్ని కాపాడుకుంటూ ఐక్యతతో పనిచేసి విజయం దిశగా అడుగులు వేయాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ, అభ్యర్థులందరూ సమన్వయంతో పనిచేసి గులాబీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. “మనం చేసిన అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తోంది. ప్రతి గల్లీలో, ప్రతి వార్డులో మనం వేసిన రోడ్లు, చేపట్టిన పనులే మన తరపున సాక్ష్యంగా నిలుస్తాయి. 42 వార్డుల్లోనూ పార్టీ పటిష్టంగా ఉంది. విజయం మనదే” అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వై. శ్రీనివాస్ రెడ్డి, నాగార్జున చారి, శ్రీనివాస్ రెడ్డి, చిట్టిబాబు నాయక్, నల్లమోతు సిద్ధార్థ, నారాయణరెడ్డి, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదులు యాదవ్, కట్టా మల్లేష్ గౌడ్, చౌగాని బిక్షం గౌడ్, అశోక్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ బంటు శ్రీనివాస్, పోకల రాజు, జొన్నలగడ్డ రంగారెడ్డి, చిర్ర మల్లయ్య, సుధాకర్ రెడ్డి, పేరాల కృపాకర్ రావు, కౌన్సిలర్ అభ్యర్థులు, మాజీ కౌన్సిలర్లు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 04, 2026

# నాగుర్లకు శుభాకాంక్షలు



**వేద న్యూస్ , ఎల్కతుర్తి:**

తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన నాగూర్ల వెంకటేశ్వర్లకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం ఎల్కతుర్తి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూకినే సంతాజి అదేవిధంగా తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా హన్మకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి కోదాటి మాధవరావు, నాయకులతో కలిసి హనుమకొండలోని ఆయన నివాసంలో నాగూర్ల వెంకటేశ్వర్లకు హృదయపూర్వకంగా శాలువాతో సన్మానించి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన ఎరువులు విత్తనాలు అందించడంలో ఫర్టిలైజర్ షాపు వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అలాంటి బాధ్యతాయుతమైన పదవికి నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక కావడం రైతు సమాజానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలను గుర్తించి పరిష్కార దశగా ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫర్టిలైజర్ రంగంలో ఉన్న అనుభవం సేవాభావం నాయకత్వ లక్షణాలతో నాగూర్ల వెంకటేశ్వర్లు ఈ పదవికి పూర్తిగా న్యాయం చేస్తారని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా కమిటీ విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మరోసారి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు తెలిపారు.

# టాలెంట్ టెస్ట్‌లో వరుణ్ సాయి ప్రతిభ



**వేద న్యూస్, వరంగల్:**

వరంగల్ అండర్ రైల్వే బ్రిడ్జి సమీపంలోని పేరుకవాడ లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రైల్వే గేట్) పదవ తరగతి విద్యార్థి ఎస్. వరుణ్ సాయి జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచాడు. ఖిలా వరంగల్ మండలంలో నిర్వహించిన మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొని రెండో స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యాడు. అనంతరం వరంగల్ నగరంలోని చింతల్ బ్రిడ్జి సమీపంలో గల ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో 100 మార్కులకు 78 మార్కులు సాధించి మెరిట్ సాధించాడు. జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వరుణ్ సాయికి ఫోరం బాధ్యులు సర్టిఫికెట్‌తో పాటు నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో సోషల్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన వరుణ్ సాయిని, అతనికి గైడ్ టీచర్‌గా వ్యవహరించిన సోషల్ స్కూల్ అసిస్టెంట్ పెరుమాండ్ల సాంబమూర్తిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. ప్రభాకర్ తో పాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

# మండల అధ్యక్షుడిగా గడికంటి జోషఫ్



**వేద న్యూస్, చందుర్తి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకుల నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. ఈ ఎన్నికలు జిల్లా అధ్యక్షుడు నేదురి మధు ఆధ్వర్యంలో నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా గడికంటి జోషఫ్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా చెన్నవేణి నరేష్, ప్రధాన కార్యదర్శిగా అరెల్లి సత్తయ్య, కోశాధికారిగా ఏనుగుల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా మల్యాల కమలాకర్, సహాయక కార్యదర్శిగా పొక్కిలి ప్రవీణ్ ఎన్నికయ్యారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు నేదురి మధుకు, తోటి మిత్రులకు గడికంటి జోషఫ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథక కూలీలు, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జనంలోకి జనసేన

- అవినీతి రహిత పాలన జనసేనతోనే సాధ్యం
- ఒక్క అవకాశం ఇవ్వండి
- జనసేన కౌన్సిలర్ అభ్యర్థుల ప్రచారం





**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన యువసేవకులు జనసేన కౌన్సిలర్ అభ్యర్థులకు పట్టణ ప్రజలు ఒక్క అవకాశం ఇవ్వాలని, గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి తమను బలపరచాలని 23 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి వంశీకృష్ణ కండెం కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ.. యువతకు ప్రజలు ఒకసారి పట్టం కట్టి చూడాలని, నేటి ప్రపంచంలో మార్పునకు జనసేన బలమైన నాయకత్వం వహిస్తుందని గుర్తించాలని అభ్యర్థించారు. అవినీతి రహిత పాలన జనసేనతోనే సాధ్యమని, నాయకత్వం మార్పు సైతం జరుగుతుందని వెల్లడించారు. తెలంగాణలో పుట్టిన పార్టీ జనసేన అని, జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శనంలో, జనసేన కరీంనగర్ జిల్లా ఇన్ చార్జీ ఆర్కే సాగర్ సారథ్యంలో గాజు గ్లాస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు.

# మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

- భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



**వేద న్యూస్, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయంలో రానున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భీమేశ్వర ప్రధాన ఆలయానికి వచ్చే భక్తులు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీల్‌చైర్ సదుపాయంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ర్యాంపును ఆయన పరిశీలించారు. అలాగే లడ్డూ కౌంటర్, పార్కింగ్ ప్రాంతాలు, క్యూ లైన్లు, చలువ పందిళ్లు, టెంట్లు, వీఐపీ రోడ్డు, టాయిలెట్లు, శివార్చన స్టేజీ, నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూ లైన్లు, పార్వతీపురం ధర్మశాల రోడ్డు సహా ఆలయ పరిసరాల్లోని వివిధ ప్రాంతాలను అదనపు కలెక్టర్ పరిశీలించారు. భీమేశ్వర స్వామి వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రోటోకాల్ కార్యాలయంలో రూ.1000 వేద ఆశీర్వచనం, రూ.500 స్పెషల్ కోడె, రూ.300 స్పెషల్ దర్శనం టికెట్లు భక్తులకు అందుబాటులో ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారి మండపంలో ఆలయ ఈవో ఎల్. రమాదేవి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈలు శాంతయ్య, వరప్రసాద్, ఆలయ డీఈలు రఘునందన్, మైపాల్ రెడ్డి, ఏఈఓలు జయకుమారి, శ్రావణ్ కుమార్, బ్రహ్మం అన్న, శ్రీనివాస్, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు
- వీసీలో డీజీపీ శివధర్ రెడ్డి



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రానున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, ఇతర పోలీస్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల చట్టాలు, ప్రవర్తనా నియమావళి అమలు వంటి అంశాలపై చర్చించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, నామినేషన్ ప్రక్రియ నుంచి ఫలితాల వరకు అప్రమత్తంగా ఉండి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని డీజీపీ సూచించారు. గత ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన వారు, రౌడీ షీటర్లు, అనుమానితులను బైండోవర్ చేయాలని ఆదేశించారు. అలాగే ఎన్నికల నిబంధనలపై పోలీస్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హాజరై జిల్లాలో తీసుకుంటున్న భద్రతా చర్యల వివరాలను డీజీపీకి వివరించారు. వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి సహా పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి

- దీర్ఘకాల ఆదాయం పొందవచ్చు
- రైతులు ముందుకు రావాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ఆయిల్ పామ్ పంట సాగుతో రైతులు అధిక దిగుబడితో పాటు దీర్ఘకాలం పాటు స్థిరమైన ఆదాయం పొందవచ్చని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామంలో నిర్వహించిన ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా మంగళవారం ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించామని, ఈ కార్యక్రమంలో భాగంగా వల్లంపట్ల గ్రామంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులతో కలిసి ఆయిల్ పామ్ మొక్కలను నాటినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్, ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు, భవిష్యత్ ఆదాయ అవకాశాలపై వివరించారు. జిల్లాలో ఈరోజు మొత్తం 32 మంది రైతుల ద్వారా 110 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటినట్లు వెల్లడించారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకొచ్చిన రైతులను అభినందించిన ఆమె, ఈ నిర్ణయం ఇతర రైతులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ పంట నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ఇస్తుందని, అన్ని కాలాలకు అనుకూలంగా ఉంటుందన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు పీఏసీఎస్‌లు, వ్యవసాయఉద్యానవన శాఖ అధికారులకు లక్ష్యాలు కేటాయించామని, రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ ఫారూక్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పీహెచ్సీ సబ్ సెంటర్ల సందర్శన

- శాయంపేటలో 236 ఎక్స్‌రే పరీక్షలు
- డీటీసీఈవో హిమబిందు



**వేద న్యూస్, శాయంపేట:**

టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా శాయంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్లను డీటీసీఈవో డా. హిమ బిందు సందర్శించారు. ఈ సందర్భంగా శాయంపేట, మాందారిపేట, ప్రగతి సింగారం సబ్ సెంటర్లలో టీబీ నిర్ధారణకు ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 236 ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అలాగే నేరేడుపల్లి, కాట్రపల్లి సబ్ సెంటర్లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. హిమ బిందు మాట్లాడుతూ.. టీబీ వ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ లక్ష్య సాధనకు క్షేత్రస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. సాయి కృష్ణ, డా. వినోద్ కుమార్, పీహెచ్ఎన్ శోభ, సూపర్వైజర్లు సీతారాము, మల్లేశం, ఏఎన్ఎంలు శ్రావణి, నిర్మల, రజిని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఏర్పాట్లపై ముందస్తు సమీక్ష



**వేద న్యూస్, కారేపల్లి:**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రానికి సమీపంలోని కోటిలింగాలలో నిర్వహించనున్న జాతర గ్రామ ప్రజలకే కాకుండా పరిసర ప్రాంతాల భక్తులకు కూడా ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుంది. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు ఈ జాతరకు హాజరై శివ దర్శనం చేసుకుంటారు. ఈ నేపథ్యంలో జాతర సమయంలో ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అవసరమని నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో పోలంపల్లి గ్రామపంచాయతీ గౌరవ సర్పంచ్ హేమలత బాలాజీ ఆధ్వర్యంలో కోటిలింగాల జాతర ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ అలెం వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ నునావాత్ సాగర్, సబ్ ఇన్స్పెక్టర్ బైరు గోపి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సమీక్షలో భాగంగా భక్తులకు తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య నిర్వహణ, రహదారి ఏర్పాట్లు, విద్యుత్ సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలపై విస్తృతంగా చర్చించారు. జాతర సమయంలో ఏర్పడే రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీస్ శాఖ తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశం ద్వారా మహాశివరాత్రి జాతరను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు బలమైన పునాది పడిందని నిర్వాహకులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, గ్రామస్తుల సమన్వయం తో కోటలింగాల జాతర విజయవంతంగా నిర్వహించబడుతుందనే విశ్వాసం వ్యక్తమైంది.

## ఇందిరమ్మ నిర్మాణాలను వేగంగా పూర్తిచేయాలి

**- ఎంపీడీఓ శ్రీలేఖ, సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న**



**వేద న్యూస్, వీర్నపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ శ్రీలేఖ, స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న-అరుణ్ కుమార్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీలేఖ మాట్లాడుతూ.. లబ్ధిదారులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా వేగవంతంగా పూర్తి కావాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఏవైనా సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు లేదా స్థానిక సర్పంచ్‌కు తెలియజేయాలని లబ్ధిదారులను కోరారు. సమస్యల పరిష్కారానికి అధికారులు పూర్తిగా సహకరిస్తారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరేష్, గ్రామ కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ వాటర్ యాక్షన్ ప్లాన్ పై ముందస్తు సమీక్ష



**వేద న్యూస్, కారేపల్లి:**

రానున్న వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ పొన్నూరు శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో 'సమ్మర్ వాటర్ యాక్షన్ ప్లాన్'పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ పొన్నూరు శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నరేంద్ర పాల్గొని, గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. నీటి వనరులను నిరంతరం పర్యవేక్షించాలని, పైపులైన్ లీకేజీలను వెంటనే అరికట్టాలని, బోర్ల మరమ్మతులు ఉంటే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు సజావుగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్ గ్రామంలో ఎదురవుతున్న నీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందిస్తూ తక్షణ పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి పెంద్రా అనిల్ కుమార్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల దాహార్తిపై సర్పంచ్ చొరవ

**- పాఠశాలలో మోటార్ మొరాయింపుతో చేతిపంపు ఏర్పాటు**

**వేద న్యూస్, కారేపల్లి:**


కారేపల్లి మండల కేంద్రంలోని రావోజీ తండా గ్రామపంచాయతీ ప్రాథమిక పాఠశాలలో తలెత్తిన తాగునీటి సమస్యను సర్పంచ్ భూక్యా బాలు సత్వర చర్యలతో పరిష్కరించారు. గత కొన్ని రోజులుగా పాఠశాలలోని బోర్ మోటార్ సాంకేతిక కారణాలతో పనిచేయకపోవడంతో విద్యార్థులు తాగునీటి కొరతను ఎదుర్కొన్నారు. మధ్యాహ్న భోజనం వంటకూ, విద్యార్థుల దాహార్తి తీర్చడానికీ నీరు అందక ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ భూక్యా బాలు వెంటనే పాఠశాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. మోటార్ మరమ్మతులకు సమయం పట్టే అవకాశం ఉండటంతో, విద్యార్థులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో అదే బోర్ పాయింట్ వద్ద తక్షణమే చేతిపంపు ఏర్పాటు చేయించారు. దీంతో పాఠశాలలో తాగునీటి సమస్యకు తాత్కాలికంగా పరిష్కారం లభించింది. ప్రస్తుతం విద్యార్థులు, ఉపాధ్యాయులు నీటిని వినియోగించుకోవడంతో పాఠశాలలో పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది. సర్పంచ్ తీసుకున్న ఈ



నిర్ణయంపై గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాల విషయంలో వెంటనే స్పందించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిత్యం నీరు వృథా

**- పట్టించుకోని అధికారులు**
**- సాగు నీరు రోడ్డుపైకి రావడంతో రైతుల ఆందోళన**



**వేద న్యూస్, చందుర్తి:**

చందుర్తి మండలం కిష్టంపేట గ్రామ పరిధిలో సనుగుల-రామారావుపల్లి సరిహద్దు భూముల వద్ద (తాళ్లల్ల పోచమ్మ ఆలయానికి వెళ్లే దారిలో) నిత్యం సాగు నీరు రోడ్డు పైకి రావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజూ సాగు నీరు వృథాగా పారుతూ రోడ్డుపై నిలవడంతో మట్టి రోడ్డు బురదమయంగా మారి, గుంతలు ఏర్పడు తున్నాయి. దీని వల్ల వ్యవసాయదారులతో పాటు వాహన చోదకులకు ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని కిష్టంపేటకు చెందిన రైతు చిగుర్ల మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గంలో టూ వీలర్లు, ఫోర్ వీలర్ వాహనాలు బురద గుంతల్లో ఇరుక్కొని ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు పెరిగాయని రైతులు చెబుతున్నారు. సాగు నీరు నియంత్రణ లేకుండా రోడ్డుపైకి వస్తుండటంతో నిత్యం నీటి వృథా కూడా జరుగుతోందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సాగు నీరు రోడ్డు పైకి రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు

**- జిల్లావ్యాప్తంగా 13,381 బస్తాల బుకింగ్**
**- జిల్లా వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ ద్వారా రైతులు ఎరువులు కొనుగోలు చేస్తున్నారని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఫెర్టిలైజర్ దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో రైతులు యాప్ ద్వారా మొత్తం 13,381 ఎరువుల బస్తాలు బుక్ చేసుకోగా, ఇప్పటివరకు 9,436 బస్తాలను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రైతులకు అవసరమైన సహాయం అందించేందుకు అన్ని కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌తో పాటు ఒక సహాయకుడిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని రైతులందరూ ఫెర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకుని ఎరువులు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎరువులకు ఎలాంటి కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి స్పష్టం చేశారు.

## ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

**- వార్డు అభ్యర్థులకు పారదర్శకంగా గుర్తుల కేటాయింపు**
**- అధికారులు సమన్వయంతో పనిచేయాలి**
**- ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం వైరా తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైరా మున్సిపాలిటీ వార్డు అభ్యర్థుల బీఫామ్ పరిశీలన, స్వతంత్ర అభ్యర్థుల ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలు, బీఫామ్‌లను పరిశీలించి, ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికలకు కేటాయించిన అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల అధికారులు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, బీఫామ్ పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ, స్వతంత్ర అభ్యర్థుల ప్రకటన, ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియ పూర్తిగా పార దర్శకంగా జరగాలని తెలిపారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించి ర్యాలీలు, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకో వాలని, సౌండ్ సిస్టమ్‌లు, వాహనాల వినియోగానికి ప్రత్యేక అనుమతి అవసరమని స్పష్టం చేశారు. ఒకే రూట్‌లో పోటీ అభ్యర్థులకు ర్యాలీలకు అనుమతి ఇవ్వవద్దని ఆదేశించారు. అక్రమంగా నగదు, మద్యం తరలిస్తూ ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పట్టుబడిన వాటిని సీజ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైరా తహసీల్దారు సురేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ గురులింగం, ఎంపీడీవో తేజావత్ సక్రియ, ఎంఈఓ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్యం ఎంతో ముఖ్యం



**- సర్పంచ్ చింతల ఉమా రవి పాల్**

**వేద న్యూస్, శాయంపేట:**

గ్రామాల్లో పరిశుభ్రత, ఆరోగ్య నిర్వహణ ఎంతో ముఖ్యమని శాయంపేట గ్రామంలో నూతన సర్పంచ్ చింతల ఉమా రవి పాల్ అన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామంలోని మురుగు కాలువలు, శ్మశాన వాటికలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మురుగు కాలువల్లో మట్టి, చెత్త పేరుకుపోవడం వల్ల నీరు నిలిచిపోయి దుర్గంధం, దోమల పెరుగుదలతో పాటు వివిధ రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేసి పరిశుభ్రంగా ఉంచడమే తమ లక్ష్యమని చెప్పారు. అనేక సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్తను తొలగించి గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపరచడంలో సర్పంచ్ తీసుకున్న చొరవకు గ్రామస్థుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## ఘనంగా జమాలుద్దీన్ ఉర్సు ఉత్సవాలు

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలో సయ్యద్ మహ్మద్ జమాలుద్దీన్ జనే మాన్ జన్నతి ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉర్సు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రధాన వీధుల గుండా భారీ ఊరేగిం పు నిర్వహించారు. ఈ ఊరేగింపులో గుర్రాల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాల షెడ్యూల్ ప్రకారం బుధవారం దీపారాధన కార్యక్రమం, గురువారం కవ్వాలి కార్యక్రమంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 04, 2026

## రేలకాయలపల్లిలో 'మినీ మేడారం'



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండలం గేటు రేలకాయలపల్లి గ్రామపంచాయతీలో సమ్మక్క-సారలమ్మ దేవతల మినీ మేడారం జాతర నేటి నుంచి ప్రారంభమైంది. రెండు రోజుల పాటు సాగనున్న ఈ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం అటవీ ప్రాంతం నుంచి అమ్మవార్లను సంప్రదాయ వాయిద్యాల నడుమ గద్దెలపైకి ప్రతిష్ఠించనున్నారు. గురువారం గద్దెలపై కొలువుదీరిన వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. భక్తులు మొక్కులు చెల్లించుకుని నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించనున్నారు. భక్తులకు తాగునీరు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయగా, రద్దీ దృష్ట్యా ప్రత్యేక పోలీస్ బందోబస్తు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించారు. పరిసర ప్రాంతాలతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

# వెంకటాపూర్ గ్రామ అభివృద్ధికి ముందడుగు

- జీపీ, ఐకేపీ భవనాల నిర్మాణాలకు భూమి పూజ



**వేద న్యూస్, కాసిపేట:**

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ నూతన భవనం, ఐకేపీ భవనాల నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి దిశగా కీలక ముందడుగుగా ఈ నిర్మాణ పనులను ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.30 లక్షల వ్యయంతో ప్రారంభించారు. ఈ పనులకు గ్రామ సర్పంచ్ పేంద్రం శంకర్, ఐకేపీ ఏపీఎం రాజ్ కుమార్ తో కలిసి మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ శుభారంభం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయం, ఐకేపీ భవనాల నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ మరింత సులభమవుతాయని తెలిపారు. మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు ఐకేపీ భవనం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధిని వేగవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పనుల నాణ్యతను కాపాడుతూ నిర్ణీత గడువులో నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రౌతు సత్తయ్య, ఉప సర్పంచ్ రొడ్డ ప్రసన్న, రాజమౌళి, నందం, మైదం రమేష్, ఆల్క రాజు, వల్క చిలుకయ్య, మహంకాళి, ఎంబడి బక్కయ్య, వల్క రవి, సల్లూరి ప్రభాకర్, తోడేటి ప్రశాంత్ తదితర గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి దోహదపడే ఈ నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

- నలుగురు మృతి.. పలువురికి తీవ్రగాయాలు - మృతులు కూలీలు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలో పసుపు రిక్కడానికి వెళ్లి తిరిగి వస్తున్నా ట్రాక్టర్ బోల్తా పడి నలుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో పలువురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పని ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో ట్రాక్టర్ బోల్తాపడడంతో ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యాసంస్థల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- వసతులు, భోజన నాణ్యత, నిర్మాణ పనుల పరిశీలన
- లోపాలుంటే వెంటనే సరిచేయాలని అధికారులకు ఆదేశాలు

**వేద న్యూస్, కాసిపేట:**

కాసిపేట మండలంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఆకస్మిక పర్యటన నిర్వహించి పలు విద్యాసంస్థలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, రేగులగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి అక్కడి వసతులు, అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. మొదట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, పాఠశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల నాణ్యతను కాపాడుతూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం పోషకాహారం అందేలా చూడాలని, వంటగది పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, హైజీన్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. అలాగే పాఠశాలకు మంజూరైన భోజనశాల (డైనింగ్ హాల్) నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీరు, మరుగుదొడ్లు, పడక గదుల వంటి మౌలిక వసతులపై కూడా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రేగులగూడ



గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడ మంజూరైన అదనపు గదుల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతి, విద్యా సామగ్రి, భోజన నాణ్యతపై అధికారులను ప్రశ్నించి, లోపాలుంటే వెంటనే సరిచేయాలని సూచించారు. విద్యార్థుల హాజరు, బోధన నాణ్యతపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖకు చెందిన అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు కృషి

- మౌలిక వసతుల కల్పనకు పూర్తి సహకారం
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- బూరుగుపల్లి పాఠశాలలో టాయిలెట్లు, లైబ్రరీ ప్రారంభం

**వేద న్యూస్, చొప్పదండి:**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని బూరుగుపల్లి గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధి హామీ నిధులతో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన టాయిలెట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం సహకారంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన లైబ్రరీని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో డైనింగ్ హాల్, అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని



ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరిస్తామని పేర్కొన్న ఎమ్మెల్యే, బూరుగుపల్లి పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటుకు సహకరించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దూలం కల్యాణ్, తహసీల్దార్ అంబటి రజిత, ఎండిఓ దామ్ రాము, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ముద్దం నగేష్, ఉప సర్పంచ్ తిరుపతి, సాగి అజయ్ రావు, దూలం శ్రీనివాస్, దూలం అంజయ్య, బుర్గు గంగన్నతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పండ్లు, బిస్కెట్లు పంపిణీ




**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పరీక్ష మెటీరియల్‌తో పాటు పండ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. మేనూర్ ఉన్నత పాఠశాల, రాయకూర్ యూపీఎస్ పాఠశాల, హుమ్నాపూర్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం 320 మంది విద్యార్థులకు ఈ సామగ్రిని అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు పార్వతి ప్రశాంత్ తమ అమ్మమ్మ జ్ఞాపకార్థంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ అధ్యక్షులు కేవి. మోహన్, జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ పహాడే, డైరెక్టర్లు పార్వతి ప్రశాంత్, గుండూరు శ్రీకాంత్ గౌడ్‌తో పాటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గాదెపాడులో అభివృద్ధి పనుల జోరు

- అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

**వేద న్యూస్, కారేపల్లి:**

మండలంలోని గాదెపాడు గ్రామపంచాయతీలో మంజూరైన అభివృద్ధి పనులను మంగళవారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిశీలనలో నూతనంగా మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణ స్థలాలను అధికారులు తనిఖీ చేసి, పనుల నాణ్యతపై దిశానిర్దేశం చేశారు. మురుగునీటి పారుదల సజావుగా సాగేలా కాలువల డిజైన్లపై చర్చించారు. అలాగే గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రధాన పైప్‌లైన్లలో ఉన్న లీకేజీలను తక్షణమే అరికట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంజూరైన పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్లు త్వరగా జారీ చేస్తే పనులు వేగంగా ప్రారంభించి ప్రజలకు మెరుగైన సౌక



ర్యాలు కల్పించవచ్చని అధికారులను కోరారు. దీనికి స్పందించిన అధికారులు, సాంకేతిక ప్రక్రియ పూర్తి చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో సింగరేణి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పొన్నూరు శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర, గ్రామపంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# కాంతివంతంగా కమలాపూర్

- ప్రధాన రహదారిపై వీధి దీపాల సమస్యకు పరిష్కారం

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగక చిమ్మచీకట్లు అలుముకున్నాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా, ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను గ్రామ సర్పంచ్ పబ్బు సతీష్, ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లిన గ్రామస్తులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ప్రజాప్రతినిధులు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కేవలం రెండు రోజుల్లోనే వీధి దీపాల సమస్యను పరిష్కరించారు. వీధి దీపాలు తిరిగి వెలగడంతో కమలాపూర్ కాంతివంతంగా మారింది. సత్వర స్పందనతో సమస్యను పరిష్కరించిన సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 04, 2026

# క్రీడలతో మానసిక ఉల్లాసం

– సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం




**వేద న్యూస్, నల్లబెల్లి :**

క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్నిస్తాయని తహసిల్దార్ ముప్పు కృష్ణ అన్నారు. సీఎం కప్ మండల స్థాయి క్రీడలను మండలంలోని కాకతీయ బ్రిలియంట్ స్టార్ గురుకుల విద్యాలయంలో అయనమంగళవారం ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో సీఎం కప్ లో క్రీడాపోటిల్లో పాల్గొనే క్రీడాకారులు మంచి ప్రతిభను కనబరిచి నియోజకవర్గ ,జిల్లా , రాష్ట్రస్థాయిలో ఎంపికై క్రీడాల్లో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కబడ్డీ ,కోకో, అథ్లెటిక్స్ ,వాలీబాల్, తదితర ఆటలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో పాటు ఎంఈఓ అనురాధ, కాకతీయ పాఠశాల డైరెక్టర్లు రామారావు, కాకతీయ ప్రిన్సిపాల్ రణధీర్ రెడ్డి, రుద్రగూడెం సర్పంచ్ మంద సుజాత రాజిరెడ్డి, పంచాయతీ సెక్రెటరీలు లక్ష్మీ సుధాకర్, పీఈటీలు రవీందర్, దేవిలాల్ ,నాగరాజు, దేవేందర్, మహేందర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్ష విధుల రెమినరేషన్ పెంచాలి

– ఇంటర్ బోర్డు కార్యదర్శికి టీ జి జె ఎల్ ఏ-475 వినతి




**వేద న్యూస్, హైదరాబాద్ ఎడ్యుకేషన్:**

2026 సంవత్సరం తెలంగాణ ఇంటర్ బోర్డు నిర్వహిస్తున్న పరీక్ష విధుల నిర్వహణ రెమ్యూ నరేషన్ పెంచాలని, మంగళవారం తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఐ.ఏ.ఎస్ కి ఆన్లైన్లో వినతి పత్రం పంపించినట్టు తెలం గాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసి యేషన్- 475 రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వస్కుల శ్రీనివాస్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ లు తెలిపారు. తెలంగాణ ఇంటర్ బోర్డు నిర్వహిస్తున్న ప్రాక్టిక ల్స్ పరీక్షలు మరియు వార్షిక పబ్లిక్ పరీక్షలు, పరీక్ష పేపర్లో మూల్యాంకన కేంద్రాలకు సంబంధించి విధులు నిర్వహిస్తున్న వారికి గత మూడు సంవత్సరాల నుంచి రెమ్యూనరేషన్ పెంచలేదని, మూడు సంవత్సరాలకు ఒకసారి రెమినరేషన్ పెంచే ఆనవాయితీ ఇంటర్ బోర్డు పాటిస్తుందని తెలుపుతూ ఈ నేపథ్యంలో 2026 ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రాక్టికల్స్ మరియు రాబోవు ఇంటర్ వార్షిక పబ్లిక్ పరీక్షలు నిర్వహణ మరియు ఇంటర్ మూల్యాం కన కేంద్రాలలో వివిధ విధులు నిర్వహిం చనున్న వారికి రమ్నరేషన్ పెంచవలసిందిగా తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యదర్శితో పాటు తెలంగాణ ఇంటర్ బోర్డు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జయప్రద భాయికి కూడా ఆన్లైన్లో వినతిపత్రం పంపించినట్లు తెలుపుతూ ఈ విషయంలో తెలంగాణ ఇంటర్ బోర్డ్ సానుకూలమైన నిర్ణయం తీసుకుంటుందని అధ్యాపకులందరూ ఆశిస్తున్నట్లు తెలిపారు.

# గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

**వేద న్యూస్, జనగామ :**

జనగామ జిల్లా పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన మోలుగూరి మల్లేశం గౌడ్ రోజువారి వృత్తిలో భాగంగా తాడు చెట్టు ఎక్కి దిగుతున్న కమంలో ప్రమాదవషాత్తు మోకు జారీ క్రిందికిపడడం జరిగింది. ఈ ప్రమాదంలో చాతి, నడుము, వెన్నె ముకకు తీవ్ర గాయాలు కావడం జరిగినది.గాయపడిన మల్లేశం గౌడ్ హనుమకొండ జిల్లా లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో మంగళవారం చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతు ల రమేష్ గౌడ్,మోకుదెబ్బ జిల్లా నాయకులు మడూరి సోమన్న గౌడ్, గడ్డమీది అశ్విన్ గౌడ్ లు పరమార్శించడం జరి గింది. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ఎక్సిగ్రేషియా, బీసీ కార్పొరేషన్ నుండి వచ్చే హాస్పిటల్ ఖర్చుల వివరాలు ప్రభుత్వానికి పంపి మల్లేశం గౌడ్



కు వచ్చే విధంగా చేసి మిమ్ములను ఆదుకుంటామని భరోసా ధైర్యం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ హనుమకొండ జిల్లా అధ్యక్షులు తోటకూరి రాందాస్ గౌడ్, బొమ్మగాని శ్యామ్ కుమార్ గౌడ్,మోలుగూరి అశోక్ గౌడ్, సంపత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ క్యాన్సర్ దినం నిర్లక్ష్యం కాదు, నివారణే రక్షణ

**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్న క్యాన్సర్ వ్యాధి గురించి మాట్లాడాల్సిన అవసరాన్ని గుర్తు చేసే రోజు ప్రపంచ క్యాన్సర్ దినం. ఆధునిక వైద్య శాస్త్రం ఎంతగా ముందుకు వెళ్లినా, అవగాహనలేమి, భయం, నిర్లక్ష్యం కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. క్యాన్సర్ అనేది ఒక్కరోజులో వచ్చిపడే వ్యాధి కాదు. జీవనశైలిలోని చిన్నచిన్న తప్పిదాలు, అలవాట్లు, పర్యావరణ ప్రభావాలు కాలక్రమేణా దీనికి దారితీస్తున్నాయి. అయినప్పటికీ, "నాకు కాదు" అనే నిర్లక్ష్య ధోరణి సమాజంలో బలంగా ఉండటమే అసలు సమస్య.

**– ముందస్తు గుర్తింపే ప్రాణరక్షణ**

క్యాన్సర్ విషయంలో ముందస్తు గుర్తింపు అత్యంత కీలకం. తొలి దశలో గుర్తిస్తే, చికిత్స విజయవంతం అయ్యే అవకాశాలు ఎంతో ఎక్కువ. సాధారణ స్క్రీనింగ్ పరీక్షలు, శరీరంలో కనిపించే చిన్న మార్పులను గమనించడం, అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి అలవాట్లు ప్రాణాలను కాపాడగలవు. కానీ, గ్రామీణ ప్రాంతాల్లోనే కాదు పట్టణాల్లో కూడా పరీక్షల పట్ల నిర్లక్ష్యం కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వైద్య ఖర్చుల భయం, సమయం లేదన్న కారణాలు చివరికి ప్రాణాలకే ముప్పుగా మారుతున్నాయి.

**– జీవనశైలే రోగానికి దారి?**

తప్పు ఆహారపు అలవాట్లు, పొగాకు వినియోగం, మద్యపానం, వ్యాయామం లేకపోవడం, అధిక ఒత్తిడి ఇవన్నీ క్యాన్సర్‌కు దారితీసే ప్రధాన కారణాలుగా మారాయి. ఆధునిక జీవనశైలిలో వేగం పెరిగింది గానీ, ఆరోగ్యం వెనక్కి వెళ్లిపోయింది. ప్యాకెట్ ఆహారం, రసాయనాలతో నిండిన పదార్థాలు మన శరీరంపై మౌనంగా ప్రభావం చూపుతున్నాయి. క్యాన్సర్ నివారణ అంటే కేవలం ఆసుపత్రుల బాధ్యత కాదు; అది ప్రతి వ్యక్తి తన జీవనశైలిని సరిదిద్దుకోవడంలోనే మొదలవుతుంది.

**– బాధితులకు మద్దతే నిజమైన మానవత్వం**

క్యాన్సర్ బాధితులు శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటారు. చికిత్స సమయంలో కుటుంబం, సమాజం నుంచి లభించే మద్దతు వారికి కొత్త శక్తిని ఇస్తుంది. కానీ ఇంకా చాలా చోట్ల క్యాన్సర్ బాధితులను వేరుగా చూసే ధోరణి ఉంది. ఈ ముద్రను తొలగించాల్సిన బాధ్యత సమాజానిదే. వారికి అవసరమైనది సానుభూతి కాదు, అర్థం చేసుకునే మనసు, అండగా నిలిచే ధైర్యం.

**– నివారణే నిజమైన విజయం**

ప్రపంచ క్యాన్సర్ దినం ఒక గుర్తుచూపు మాత్రమే. ఏడాదిలో ఒకరోజు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మర్చిపోవడం సరిపోదు. నిర్లక్ష్యం కాదు నివారణే రక్షణ అనే సందేశాన్ని ప్రతి రోజు ఆచరణలో పెట్టాలి. ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమమైన వైద్య పరీక్షలు, భయాన్ని పక్కన పెట్టి నిజాన్ని ఎదుర్కొనే ధైర్యం ఇవే క్యాన్సర్‌పై మనం సాధించగల నిజమైన విజయం. ప్రతి వ్యక్తి తన ఆరోగ్యంపై బాధ్యత తీసుకున్న రోజే, క్యాన్సర్ వంటి వ్యాధులపై సమాజం నిజంగా గెలిచిన రోజు అవుతుంది.

క్యాన్సర్ బాధితుడు శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా తీవ్రమైన పోరాటం చేస్తాడు. చికిత్స భయం, భవిష్యత్తుపై అనిశ్చితి, కుటుంబంపై పడే భారం అనే ఆలోచనలు వారిని లోపలినుంచి కుంగదీస్తాయి. ఇలాంటి సమయంలో కుటుంబం, సమాజం నుంచి వచ్చే మాటలు, ప్రవర్తనే కీలకం. దురదృష్టవశాత్తు, ఇంకా చాలా చోట్ల క్యాన్సర్‌ను అంటువ్యాధిలా చూసే మనస్తత్వం ఉంది. ఈ సామాజిక ముద్ర బాధితుడి బాధను రెట్టింపు చేస్తోంది. ప్రభుత్వాలు, వ్యవస్థల బాధ్యత క్యాన్సర్ నివారణలో ప్రభుత్వాల పాత్ర కీలకం. అవగాహన కార్యక్రమాలు, ఉచిత స్క్రీనింగ్

ఒక రోజు కాదు ఒక ఉద్యమం కావాలి ప్రపంచ క్యాన్సర్ దినం ఒక తేదీ మాత్రమే కాదు, ఒక ఆలోచన. నిర్లక్ష్యం కాదు నివారణే రక్షణ అనే సందేశం గోడలపై నినాదంగా ఉండకూడదు; మన జీవితాల్లో ఆచరణగా మారాలి. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి ఈ పోరాటంలో భాగస్వామి కావాలి. క్యాన్సర్‌పై పోరాటం వైద్యులదే కాదు, సమాజం మొత్తానిదే. ఆరోగ్యాన్ని విలువైనదిగా భావించిన రోజే, క్యాన్సర్ వంటి వ్యాధులపై మనం నిజంగా గెలిచిన రోజు అవుతుంది.

# మన్రేగా పరిరక్షణ యాత్రకు కొత్తచెరువులో భారీ మద్దతు



– రెండో రోజున సత్యసాయి జిల్లాలో యాత్ర కొనసాగింపు
– గ్రామ్ జి చట్టంపై తీవ్ర విమర్శలు
– కాంగ్రెస్ ఉద్యమానికి ప్రజల అండ

**అమరావతి, వేద న్యూస్:**

రెండవ రోజు కొనసాగుతున్న మన్రేగా పరిరక్షణ యాత్రలో భాగంగా సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండల కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కాంగ్రెస్ నేత వైఎస్ షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. మన్రేగా చట్టం ద్వారా పేదలకు ఉపాధి, భద్రత లభించిందని, అలాంటి చట్టాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు చేయడం అన్యాయమని షర్మిల విమర్శించారు. వీబీ గ్రామ్ జి చట్టం పేదల పొట్ట కొట్టే చట్టమని, దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 125 రోజులు పని కల్పిస్తామని కేంద్రం చెప్పడం పచ్చి బూటకమని ఆరోపించారు. మన్రేగా ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరిగిందని, వలసలు తగ్గాయని, కోట్లాది కుటుంబాలకు జీవనాధారం ఏర్పడిందని ఆమె గుర్తు చేశారు. అలాంటి చట్టాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదలపై దాడి చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన రాష్ట్రవ్యాప్త మన్రేగా పరిరక్షణ ఉద్యమానికి కొత్తచెరువు మండల ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించడం హర్షణీయమని షర్మిల తెలిపారు. ప్రజల అండతో ఈ పోరాటాన్ని మరింత బలంగా ముందుకు తీసుకెళ్తామని, పేదల హక్కుల కోసం చివరి వరకు పోరాడుతామని ఆమె స్పష్టం చేశారు.

# స్మార్ట్ మీటర్లపై విద్యుత్ బిల్లుల భారం తగ్గింపు

**అమరావతి, వేద న్యూస్:**

స్మార్ట్ మీటర్ల అమలుతో విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయన్న వినియోగదారుల ఆందోళనలకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఊరటనిచ్చింది. మీటర్లలో లోపాల కారణంగా కాకుండా, రియాక్టివ్ ఎనర్జీ (కేవీఏఆర్‌హెచ్)కు సంబంధించిన అదనపు ఛార్జీల వల్లే బిల్లులు పెరిగినట్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో 201920 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన టారిఫ్ ఆర్డర్‌లోని 'లీడింగ్ కేవీఏఆర్‌హెచ్'పై వసూలు చేసే నిబంధనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ఏపీఈఆర్సీ ప్రకటించింది. దీంతో స్మార్ట్ మీటర్ల కారణంగా వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకున్నట్టయింది. ఇప్పటికే అధికంగా వసూలు చేసిన మొత్తాలను రాబోయే విద్యుత్ బిల్లుల్లో సర్దుబాటు చేయాలని విద్యుత్ పంపిణీ సంస్థలను ఏపీఈఆర్సీ ఆదేశించింది. దీని వల్ల వినియోగదారులు నష్టపోకుండా రక్షణ కల్పించినట్టవుతుందని తెలిపింది. అయితే, స్మార్ట్ మీటర్లు విద్యుత్ సరఫరాలో సమర్థత, పారదర్శకత, విశ్వసనీయత పెంచే దిశగా కీలకమని ఏపీఈఆర్సీ పేర్కొంది. వినియోగదారుల సంక్షేమాన్ని కాపాడుతూనే, ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని స్పష్టం చేసింది.



# విశాఖలో అంతర్జాతీయ నౌకాదళ వేడుకలు

**అమరావతి, వేద న్యూస్:**

ప్రపంచ స్థాయి నౌకాదళ వేడుకలకు విశాఖపట్నం సన్నద్ధమవుతోంది. ఫిబ్రవరి 18 నుంచి అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), ఫిబ్రవరి 19 నుంచి మిలాన్2026 నౌకాదళ విన్యాసాలు నగరంలో నిర్వహించనున్నారు. ఈ రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు ప్రపంచంలోని పలు దేశాల నౌకాదళాలు హాజరుకానున్నాయి. ఈ వేడుకల నిర్వహణకు సంబంధించి తూర్పు నౌకాదళ కమాండ్ ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. భద్రత, వసతి, రవాణా, లాజిస్టిక్స్ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్ణయించారు. అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ ద్వారా భారత నౌకాదళ సామర్థ్యం, సముద్ర భద్రతలో భారత్ పాత్రను ప్రపంచానికి చాటనున్నారు.



వేద న్యూస్

బుధవారం ఫిబ్రవరి 04, 2026

# అందానికే అసూయ పుడుతుందేమో.. లంగావోణీలో భాగ్యశ్రీ!



**వేద న్యూస్ డెస్క్:**

అందాల ముద్దుగుమ్మ భాగ్యశ్రీ బోర్సే తన తాజా లంగావోణీ ఫొటోలతో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. సహజమైన చిరునవ్వు, సొగసైన లుక్‌తో ఆమె షేర్ చేసిన చిత్రాలు క్షణాల్లోనే నెట్టింట వైరల్‌గా మారాయి. సంప్రదాయ వేషధారణలో భాగ్యశ్రీ చూపించిన అందం అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. తెలుగులో మిస్టర్ బచ్చన్ చిత్రంతో తెరంగేట్రం చేసిన భాగ్యశ్రీ, తొలి సినిమా ఫలితం ఆశించిన స్థాయిలో లేకపోయినా తన గ్లామర్, నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం ఆంధ్రా కింగ్ తాలూకా చిత్రంలో నటించి మెప్పించినా, అది కూడా హిట్ ఇవ్వలేకపోయింది. అయినప్పటికీ అవకాశాల విషయంలో ఆమె వెనక్కి తగ్గకుండా వరుస ప్రాజెక్టులతో ముందుకెళ్తోంది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన కింగ్ డమ్ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉన్న భాగ్యశ్రీ, దుల్కర్ సల్మాన్, రానాతో కలిసి కూడా సినిమాలు చేస్తోంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలు చిత్రాలతో ఫుల్ షెడ్యూల్‌లో ఉన్న ఈ బ్యూటీ, సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండి తన క్యూట్, గ్లామర్ ఫొటోలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా లంగావోణీలో మెరిసిపోయిన భాగ్యశ్రీ అందం చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సంప్రదాయ వేషంలోనూ గ్లామర్‌కు ఏమాత్రం తగ్గకుండా కనిపించడంతో ఆమె ఫొటోలు మరింత హైలైట్‌గా మారాయి. అభిమానులు ఈ ఫొటోలపై లైక్స్, కామెంట్స్‌తో ప్రేమను చూపిస్తున్నారు.

# ఫిబ్రవరి 11 నుంచి ఓటీటీలోకి మన శంకర వరప్రసాద్ గారు

**వేద న్యూస్ డెస్క్:**

ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న మన శంకర వరప్రసాద్ గారు చిత్రం త్వరలో ఓటీటీలోకి రానుంది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా మాస్, కామెడీ, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో భారీ విజయాన్ని సాధించింది. జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించింది. ఇప్పటివరకు ఈ సినిమా వసూళ్లు 400 కోట్ల మార్క్‌ను దాటినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. థియేటర్లలో మూడు వారాలు పూర్తయినా కూడా ఈ సినిమా కలెక్షన్లలో తగ్గుదల కనిపించలేదని సమాచారం. చిరంజీవి కామెడీ టైమింగ్, ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటించగా, అతిథి పాత్రలో విక్టరీ వెంకటేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమా డిజిటల్ హక్కులు ప్రముఖ ఓటీటీ వేదిక సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 11 నుంచి ఓటీటీలో స్ట్రీమింగ్ ప్రారంభం కానుందని సమాచారం. అయితే




దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. థియేటర్లలో ఫుల్ లెంగ్త్ వినోదం అందించిన ఈ సినిమా, ఓటీటీ ప్రేక్షకుల నుంచి కూడా మంచి స్పందన పొందుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పాప్ దిగ్గజం బయోపిక్.. 'మైఖేల్' ట్రైలర్ విడుదల




**వేద న్యూస్ డెస్క్:**

పాప్ సంగీత ప్రపంచాన్ని శాసించిన మైఖేల్ జాక్సన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్ 'మైఖేల్' ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ విడుదలతో ప్రపంచవ్యాప్తంగా మైఖేల్ అభిమానుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. ఈ చిత్రంలో మైఖేల్ జాక్సన్ పాత్రను ఆయన సొంత మేనల్లుడు జాఫర్ జాక్సన్ పోషించడమే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ట్రైలర్‌లో జాఫర్ హావభావాలు, నడక, డ్యాన్స్ మూమెంట్స్, బాడీ లాంగ్వేజ్ అచ్చం మైఖేల్‌ను గుర్తు చేసేలా ఉండటంతో అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా మైఖేల్ చిన్ననాటి జీవితం నుంచి గ్లోబల్ సూపర్ స్టార్‌గా ఎదిగిన ప్రయాణాన్ని, ఆయన ఎదుర్కొన్న వ్యక్తిగత సవాళ్లు, కుటుంబ నేపథ్యంలో చోటు చేసుకున్న సంఘటనలను భావోద్వేగంగా చూపించబోతోంది. ముఖ్యంగా తండ్రి జో జాక్సన్‌తో ఉన్న సంక్లిష్ట సంబంధాలు, సంగీత ప్రపంచంలో మైఖేల్ సాధించిన అపూర్వ విజయాలు ట్రైలర్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయని అభిమానులు సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా దర్శకత్వం వహించగా, మైఖేల్ తల్లిదండ్రుల పాత్రల్లో కోల్మన్ డొమింగో, నియా లాంగ్ నటించారు. ఏప్రిల్ 24న ఈ బయోపిక్ ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. మైఖేల్ జీవితం తెరపై ఎలా ఆవిష్కృతమవుతుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# ఆరెంజ్ ఆర్మీకి కొత్త టెన్షన్.. కెప్టెన్ ఫిట్‌నెస్‌పై కలవరమే..!




**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌కు సిద్ధమవుతున్న ఆరెంజ్ ఆర్మీకి అనుకోని టెన్షన్ మొదలైంది. జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ పూర్తిస్థాయిలో ఫిట్ కాకపోతే జట్టు వ్యూహాల్లో మార్పులు చేయాల్సి వచ్చే అవకాశం ఉందని మేనేజ్‌మెంట్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా బౌలింగ్ విభాగంలో కమిన్స్ అనుభవం, నాయకత్వం జట్టుకు కీలకమని కోచ్‌లు భావిస్తున్నారు. అతని గైర్హాజరీ జట్టు సమతుల్యతపై ప్రభావం చూపే అవకాశం ఉందన్న చర్చ సాగుతోంది. ఈ పరిస్థితిలో తాత్కాలికంగా కెప్టెన్సీ బాధ్యతలు ఎవరు చేపట్టాలి, బౌలింగ్ యూనిట్‌ను ఎవరు నడిపించాలి అన్న అంశాలపై జట్టు మేనేజ్‌మెంట్ అంతర్గతంగా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అయితే కమిన్స్ త్వరగా కోలుకుని టోర్నమెంట్ ఆరంభానికి అందుబాటులోకి వస్తాడనే ఆశను మాత్రం జట్టు వదులుకోవడం లేదు. వైద్య బృందం పర్యవేక్షణలో అతడు రికవరీ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

# టీ20 ప్రపంచ కప్ 2026..

## టీమిండియాకు సవాలుతో కూడుకున్నదే అనిల్ కుంబ్లే



**వేద న్యూస్ డెస్క్:**

ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న టీ20 ప్రపంచ కప్ 2026లో భారత జట్టుకు ఈసారి పోటీ కాస్త కఠినంగానే ఉండబోతోందని భారత మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. భారత్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నప్పటికీ, 2024లో టైటిల్ గెలిచిన జట్టుతో పోలిస్తే ప్రస్తుత జట్టు కొంత బలహీనంగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. 2024లో రోహిత్ శర్మ సారథ్యంలో భారత జట్టు ఛాంపియన్‌గా నిలిచి 11 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్లో ఉత్కంఠభరిత విజయంతో టైటిల్ సాధించింది. ఆ టోర్నీలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా అనుభవం కీలకంగా మారింది. అయితే ఆ విజయం తర్వాత ఈ ముగ్గురు పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. దీంతో ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో కొత్త సమతుల్యతతో కూడిన జట్టు బరిలోకి దిగుతోంది. ప్రస్తుత జట్టు బలంగానే ఉందని కుంబ్లే స్పష్టం చేశాడు. బౌలింగ్ విభాగంలో మంచి ఎంపికలు ఉన్నాయని, బ్యాటింగ్‌లో టాప్ ఆర్డర్ పటిష్టంగా కనిపిస్తోందని చెప్పాడు.

# భారీగా తగ్గనున్న స్మార్ట్‌ఫోన్ల ధరలు




వేద న్యూస్ డెస్క్ :

ఈ రోజుల్లో స్మార్ట్‌ఫోన్ లేని జీవితం ఊహించలేనిది. యువత నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరి చేతిలో ఫోన్ కనిపిస్తోంది. అయితే రానున్న రోజుల్లో స్మార్ట్‌ఫోన్ల ధరలు గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీనికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం 2026 బడ్జెట్‌లో తీసుకున్న కీలక నిర్ణయాలే. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సాంకేతికత, తయారీ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ముఖ్యంగా లిథియం అయాన్ బ్యాటరీల తయారీలో ఉపయోగించే ముడి పదార్థాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని తగ్గించారు. లిథియం అయాన్ బ్యాటరీలు స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాల్లో కీలక భాగం కావడంతో ఈ నిర్ణయం నేరుగా ధరలపై ప్రభావం చూపనుంది. ముడి పదార్థాలపై పన్నులు తగ్గడంతో బ్యాటరీ తయారీ ఖర్చులు తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. తయారీ వ్యయం తగ్గితే, ఆ ప్రయోజనం తుది ఉత్పత్తి ధరలపై పడుతుంది. ఫలితంగా మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు మరింత చౌకగా మారే అవకాశం ఉంది. అధిక ధరల కారణంగా ఇప్పటివరకు కొత్త ఫోన్ కొనుగోలు వాయిదా వేసుకున్న వినియోగదారులకు ఇది పెద్ద ఊరటగా మారనుంది. ఈ నిర్ణయం వెనుక ప్రభుత్వ ప్రధాన లక్ష్యం దేశీయ తయారీని బలోపేతం చేయడం. ప్రస్తుతం భారత్ బ్యాటరీలు, వాటి భాగాల కోసం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడుతోంది. కస్టమ్స్ సుంకాల్లో తగ్గింపుతో దేశీయ ఉత్పత్తి పెరిగి, భారత్ ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగాలన్నది ప్రభుత్వ ఆశయం. ఇదే క్రమంలో ఎలక్ట్రానిక్స్ భాగాల తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ పథకానికి భారీగా నిధులు కేటాయించింది. 202627 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకానికి సుమారు 40000 కోట్ల రూపాయలు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఈ అన్ని నిర్ణయాల ప్రభావం వచ్చే ఆర్థిక సంవత్సరంలో స్పష్టంగా కనిపించనుందని అంచనా. పరిశ్రమల ఖర్చులు తగ్గడంతో మార్కెట్లో పోటీ పెరిగి, వినియోగదారులకు నేరుగా లాభం చేకూరనుంది. మొత్తంగా చెప్పాలంటే, రాబోయే రోజుల్లో కొత్త స్మార్ట్‌ఫోన్ కొనడం ఇప్పటికంటే తక్కువ ఖర్చుతో సాధ్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

# మినిమం బ్యాలెన్స్ నిబంధనతో బ్యాంకులకు భారీ ఆదాయం..

**వేద న్యూస్ డెస్క్:**




బ్యాంకు ఖాతాల్లో తప్పనిసరిగా మినిమం బ్యాలెన్స్ ఉంచాలనే నిబంధన ప్రభుత్వరంగ బ్యాంకులకు భారీ ఆదాయాన్ని తీసుకొచ్చింది. గత మూడేళ్లలో 11 ప్రభుత్వరంగ బ్యాంకులకు మినిమం బ్యాలెన్స్ చార్జీల రూపంలో మొత్తం రూ.8092 కోట్లు వసూలైనట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి లోక్‌సభలో వెల్లడించారు. మంత్రి వివరాల ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరంలో మినిమం బ్యాలెన్స్ చార్జీల ద్వారా రూ.2407.82 కోట్లు, 2023-24లో రూ.2909.10 కోట్లు, 2024-25లో రూ.2775.91 కోట్లు బ్యాంకులకు ఆదాయంగా లభించాయి. అలాగే ఖాతాదారుల నుంచి ఎస్‌ఎంఎస్ చార్జీల రూపంలో రూ.3387.77 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. పాన్, ఆధార్ లింక్ చేయడంలో జాప్యానికి విధించిన ఆలస్య రుసుముల ద్వారా రూ.2335.75 కోట్లు వచ్చాయని చెప్పారు. అదేవిధంగా ఆలస్యంగా ట్యాక్స్ రిటర్న్లు దాఖలు చేసిన వారి నుంచి ఫైన్ రూపంలో రూ.7664.94 కోట్లు వసూలైనట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ గణాంకాలు బ్యాంకింగ్ వ్యవస్థలో ఛార్జీలు, జరిమానాల రూపంలో ప్రభుత్వరంగ బ్యాంకులకు ఎంత పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుందో స్పష్టంగా చూపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పెరిగిన నూనె రేట్లు..

**వేద న్యూస్ డెస్క్:**



మార్కెట్‌లో వంట నూనెల ధరలు నెల రోజుల్లోనే గణనీయంగా పెరిగి సామాన్య ప్రజల బడ్జెట్‌ను దెబ్బతీస్తు న్నాయి. గత నెల రోజుల వ్యవధిలో సన్ ఫ్లవర్ నూనె లీటరు ధర రూ.150 నుంచి రూ.167కు చేరింది. వేరుశనగ నూనె లీటరు ధర రూ.180కు పెరగగా, పామాయిల్ ప్యాకెట్ ధర రూ.120కు ఎగబాకింది. నూనెల ధరల పెరుగుదలతో వంటింటి ఖర్చులు ఒక్కసారిగా పెరిగిపోయాయని గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూనెలతో పాటు వేరుశనగ పలుకుల ధరలు కూడా సామాన్యులను షాక్‌కు గురిచేస్తున్నాయి. గతంలో కిలో రూ.140గా ఉన్న వేరుశనగ పలుకుల ధర ప్రస్తుతం ఏకంగా రూ.200కు చేరింది. దీంతో ఇళ్లలో వినియోగం తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వినియోగదారులు చెబుతున్నారు. చిరు వ్యాపారులు కూడా ముడిసరకుల ధరలు పెరగడంతో లాభాలు తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు కొన్ని నూనె తయారీ సంస్థలు వినియోగదారులకు తెలియకుండా గ్రాములు తగ్గించి అదే ధరకు ప్యాకెట్లు విక్రయిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లీటరు ప్యాకెట్ పేరుతో 910 గ్రాముల స్థానంలో 850 లేదా 800 గ్రాముల ప్యాకెట్లను మార్కెట్‌లోకి తీసుకువచ్చి వినియోగదారులను మోసం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ధరలు పెరుగుతుండటం, పరిమాణాలు తగ్గిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073